క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: సిద్దిపేటలోని ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియను మెరిట్ ప్రకారం నిర్వహించనున్నట్లు చెప్పారు.

బీఆర్‌ఎస్‌కే మద్దతు



తీర్మాన ప్రతిని ఎంపీపీకి అందజేస్తున్న సర్పంచ్ మమత, గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇస్తామని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ ఎరవెల్లి మమత పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. అనంతరం తీర్మాన ప్రతిని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మలకు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో గ్రామ పంచాయతీ భవనం, మహిళా, వడ్డెర సంక్షేమ భవనాలను నిర్మించుకున్నామని తెలిపారు.

మండల సభ వాయిదా

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. అయితే కోరం లేకపోవడంతో వాయిదా పడింది. రెండు గంటలు వేచి ఉన్నప్పటికీ సభ్యులు ఎవరూ రాకపోవడంతో ఎంపీడీఓ అనురాధ వాయిదా వేశారు. శనివారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

సిద్దిపేటరూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటికి 15 రోజులకు చేరుకోగా పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన దీక్షలు చేపడుతున్నామని తెలిపారు.

డివిజన్ సాధనకు కలిసి రావాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీధర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో అన్ని కుల సంఘాలు కలిసి రావాలని మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం దీక్ష ఖర్చుల నిమిత్తం జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్‌కు రూ.1,116 విరాళం అందించారు.

హెల్మెట్ల పంపిణీ

దుబ్బాకరూరల్: కేఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అప్పనపల్లిలో హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని పేర్కొన్నారు.

దుబ్బాక మజీద్ కమిటీ ఎన్నిక

దుబ్బాక: దుబ్బాక మజీద్ కమిటీ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం రసవత్తరంగా సాగింది. ప్రత్యర్థి చాంద్‌మియాపై మహ్మద్ ఖలీల్ 15 ఓట్ల తేడాతో గెలుపొందారు. వరుసగా రెండోసారి ఖలీల్ గెలుపొందడం విశేషం. నూతన అధ్యక్షుడిని మజీద్ కమిటీ సభ్యులు సత్కరించారు.

నూతన నియామకం

దుబ్బాక: వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా దుబ్బాక మండలం హబ్సీపూర్‌కు చెందిన అస్క రాజు నియామకమయ్యాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు



రోడ్లు ఊడ్చి.. చెత్త ఏరి..

హుస్నాబాద్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'

హుస్నాబాద్: పట్టణంలోని మార్కెట్‌లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య సిబ్బందితో కలిసి పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు ఏరివేసి రోడ్లను శుభ్రం చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత హాజరై మాట్లాడారు. ప్రజలందరూ బాధ్యతగా చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు స్వర్ణలత, భాగ్యరెడ్డి, రత్నమాల, కో ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్, శ్రీలత, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

హుస్నాబాద్‌రూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గాంధీనగర్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ. 7,752 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్‌పాషా, పర్షరాములు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అల్పాహారం పంపిణీ

గజ్వేల్: ఇంజినీర్స్‌డే సందర్భంగా గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లైసెన్స్‌డ్ సివిల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అల్పాహారం పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఉపాధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు నరేష్‌గౌడ్, సత్యం, సుమంత్, సంజయ్, శ్రీకాంత్, సురేష్, సాయిచరణ్, వినిత్, విష్ణు, మురళి, పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు అందజేత

కోహెడ(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని ఎస్‌ఐ తిరుపతి అన్నారు. శుక్రవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులకు పంపిణీ చేశారు. నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని.. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం



- బీజేపీ నాయకురాలు మంజులారెడ్డి

హుస్నాబాద్: బీజేపీలో చేరి మొదటిసారి హుస్నాబాద్‌కు వచ్చిన సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డికి మహిళలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. బంజర్‌పల్లి స్టేజీ నుంచి హుస్నాబాద్ వరకు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా హుస్నాబాద్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేశానన్నారు. బీజేపీ అగ్రనేతల సూచనతో హుస్నాబాద్‌పై కాషాయ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విజయపాల్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్, అక్కన్నపేట మండల అధ్యక్షుడు వీరాచారి, నాయకులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మంజూరు చేసిన రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం'

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. కాగా ఇంజినీర్స్‌డేను పురస్కరించుకొని ఇరిగేషన్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేసి విరమణ పొందిన ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని సన్మానించారు.

కానిస్టేబుల్ రక్తదానం

సిద్దిపేటకమాన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబుకు అత్యవసర సమయంలో కానిస్టేబుల్ స్పందించి రక్తదానం చేశాడు. పట్టణానికి చెందిన ఓ బాబు అనారోగ్యంతో సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స సమయంలో రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ వెంటనే స్పందించి శుక్రవారం బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

సిద్దిపేటరూరల్: ఈనెల 18న జరిగే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద 4వ రోజు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. కార్యక్రమంలో మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సభ్యులతో సుడా డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని సుడా డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వ్యాస మహర్షి యోగా సొసైటీ 14వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేటలో ప్రతి వార్డులో నిత్య యోగా సాధనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతీరోజు యోగ సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొమురవెల్లి అంజయ్య, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి, యోగా గురువులు తోట సతీష్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాల సందర్శన



మహిళలతో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగిన టెట్ పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ రమేష్ సందర్శించారు. ప్రజ్ఞాపూర్‌లో గల జెడ్పీహెచ్ఎస్, గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని పాలిటెక్నిక్ కళాశాలతో పాటు బాలుర, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు తమ పిల్లలను తల్లిదండ్రుల వద్ద విడిచివెళ్లగా వారిని ఏసీపీ రమేష్ పలకరించి వివరాలు తెలుసుకున్నారు.

బీఆర్‌ఎస్ పతనం ఖాయం

- దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్‌ఎస్ పతనం ఖాయమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోసాన్‌పల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వివిధ పార్టీలకు చెందిన యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు బండారు లాలు, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈసందర్భంగా స్పీడ్ లేజర్‌గన్, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెట్టయ్య చౌదరి, కరస్పాండెంట్ అంబదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగామకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

చేర్యాల(సిద్దిపేట): జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభ కార్యక్రమానికి పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. ర్యాలీని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, అంజయ్య, సాయికిరణ్, తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఎంపీటీసీ మృతికి మంత్రి సంతాపం**

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని చిన్నగుండవెల్లి ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతి శుక్రవారం అనారోగ్యంతో అకాల మరణం పొందారు. ఆమె మృతికి మంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు. గ్రామ, మండల అభివృద్ధికి నిరంతరం పరితపించేవారని కొనియాడారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

- **నూతన కార్యవర్గం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామ శాలివాహన సంఘం సమావేశం మండల అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ గౌరవ అధ్యక్షుడిగా నాంపల్లి, అధ్యక్షుడిగా బాలకిషన్, ఉపాధ్యక్షులుగా రాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

- **డిమాండ్లు పరిష్కరించాలి**

సిద్దిపేటమాస్: తమ డిమాండ్లను పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

- **క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక**

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మ జ్యోతిబా పూలే మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థినులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. 60 మంది విద్యార్థినులు పాల్గొనగా 34 మంది ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు.

- **మహాధర్నాకు తరలిరండి**

గజ్వేల్‌రూరల్: మాలల హక్కుల సాధన కోసం నిర్వహించ తలపెట్టిన 'హలో మాల.. ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళితరత్న అవార్డు గ్రహీత, మాల మహానాడు గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు మన్నె శేఖర్ పిలుపునిచ్చారు. మాలల హక్కులు, రాజ్యాధికార సాధన దిశగా ఈనెల 19 నుంచి 22 వరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేష్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగరాజు, రవి, కుమార్, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **ఉపాధ్యాయుల నిరసన**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీలు మ్యానువల్ పద్ధతిలో జరపాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని ఎస్టీటీ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో అన్ని పాఠశాలల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

- **పేదలకు అండగా లయన్స్ క్లబ్**

హుస్నాబాద్: అన్ని వర్గాలకు లయన్స్ క్లబ్ సేవలు అందిస్తుందని ఫస్ట్‌వైస్ డిస్ట్రిక్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం కొత్తగా లయన్స్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ ప్రాంతంలో లయన్స్ క్లబ్ కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

- **ఎమ్మెల్యేను గెలిపించాలని పూజలు**

హుస్నాబాద్‌రూరల్: ఎమ్మెల్యే సతీష్‌కుమార్ లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం కూచనపెల్లి గ్రామస్తులు స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో అలుమల్ల ప్రభాకర్‌రెడ్డి, మంద సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ రాంచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ మహేశ్, గాలిరెడ్డి, రవి, నాయకులు పాల్గొన్నారు.

- **సన్మానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం బ్రహ్మకుమారీలు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేష్ కుమార్‌తో పాటు ఇతర ఇంజినీర్లను సన్మానించారు.

లీకేజీని అరికట్టారు



అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 12వ తేదీన 'లీకేజీలు అరికట్టరూ'..? అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ ఉన్నతాధికారులు స్పందించారు. బస్టాండ్ ఆవరణలో పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. నిర్మాణ పనులను సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట గ్రామస్తులు, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, అనిల్, చింతల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

'బీసీ బంధు'లో అన్యాయం

మిరుదొడ్డి(దుబ్బాక): నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం మిరుదొడ్డి మండల సర్వసభ్య సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. బీసీ బంధు పంపిణీలో తమ గ్రామాలకు తీరని అన్యాయం జరిగిందంటూ మండల సర్వసభ్య సమావేశానికి రాకుండా వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అలక వహించారు. దీంతో ఎంపీపీ గజ్జెల సాయిలు స్పందించి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో మాట్లాడారు. ప్రతి గ్రామానికి బీసీ బంధు పంపిణీ జరిగేలా న్యాయం చేస్తానని బుజ్జగించడంతో సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత ప్రారంభమైంది. అనంతరం నివేదికలను అధికారులు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. కాగా గ్రామాల్లో విద్యుత్, మిషన్ భగీరథ తాగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించడం లేదంటూ సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.